స్కెచ్:

# భక్తికి కీలకం

శ్రీ డా. జి. వి. స్వామి

నాకు ఆశ్చర్యం వేసింది. మా రాజులో వచ్చిన మార్పు నాకు చాల ఆశ్చర్యం వేసింది.

రాజు గొప్ప నాస్తికవాది. నాతో వైద్యం చదివే రోజుల్లో, తీవ్రమైన నాస్తికవాది. ఆఖరుకు నన్ను కూడ నాస్తికుణ్ణి చేసేడంటే నమ్మండి!

. రాజు నాస్తికవాదంలో ప్రముఖుడవటం చేతనే గొప్ప జీవశాస్త్రం, వృక్షశాస్త్రం, జంతుశాస్త్రం, రసాయనికశాస్త్రంలలో ప్రావీణ్యత గల విద్యార్థిగా తయారయాడు.

నాకు ఆశ్చర్యం వేసింది. ఇంత నాస్తికుడు హఠాత్తుగా గొప్ప ఆస్తికుడయి పోయాడు కదా అని;

ఇంత గొప్పమార్పును, ఏ ప్రబలమైన సంఘటనలు తీసుకొచ్చాయా అనీ...ఇంత మార్పును కలిగిన సంఘటన ఏ జాతికి చెందుతుందా అని...ఆ జాతికి చెందిన ఆ సంఘటన ఎంత తీవ్రంగా ఉండాలా అనీ ఆశ్చర్యపోయాను.

చలనం లేని నాస్తికుడనుకున్నాం. ఏ మంత్రంవల్లో ఏ తంత్రంవల్లో, ఏ మాకీ వల్లో ఇలా తయారయ్యేడులా వుంది అనుకున్నాను.

ఆయినా ఆశ్చర్యకరమైన మార్పేమైపెచ్చు వ్రతాలు చేయడం-వ్రతాలుచేయడమే కాదు, వ్రతాలుచేస్తున్నానని అందరికీ చెప్పడం—చెప్పడమేమిటి ప్రకటన చేయడం—అంతే కాదు. ఆహ్వానాలు ముద్రించిపంచడం.

వ్రతం నెలరోజు లుందనగానే... అందరకూ ఉత్సాహంతో ఈ సంగతి ఎరుకపరిచేస్తూ డప్పు వాయించేవాడు. మురిసి పోతూ చెప్పేవాడు.

వ్రతానికి నెలకు ముందే వ్రతమయినంత పని చేసేవాడు. వ్రతంకంటె ఎక్కువ హడావడి చేసేవాడేమో!

ఈ వ్రతం, ఈ ఆర్భాటం, ఇంత ఆసక్తి, ఇంత శ్రద్ధ—ఎక్కడొచ్చాయా? అని ఆలోచించాను.

ఒక వ్రతానికి నేనూ హాజరయ్యాను. రాజు వ్రతంపై భక్తికంటె వ్రతానికి వచ్చే వాళ్లపై భక్తి చూపడం ప్రారంభించాడు.

అతిథులంటె, ఇంత శ్రద్ధ ఎందుకా అని యోచించాను.

ఏమీ పాలుపోలేదు

వ్రతమైన తెల్లారి రాజు చాలా హుషారుగా ఉన్నాడు.

ఆనాటి సాయంకాలము, నేనూ రాజు ఒక కేసు చూడడానికి పోయాం.

కార్లో, అడిగాను 'రాజూ, ఏమిటీ పరివర్తనం' అని.

రాజు ఏమిటి అన్నట్లు చూసి 'ఓహో, ఈ భక్తి, వ్రతాలా?' అన్నాడు.

నేను ఏమో చెపుతాడని ఎదురు చూచాను.

రాజు, ఏదో తలుచుకొని నవ్వాడు.!

"...ఇది పాలకొల్లురా స్వామీ... కలకత్తా కాదు ...ఒక్కొక్క కేసు చూడటం... ఆఖరురోజున బిల్లు వాళ్ల చేతుల్లో పెట్టడం. కోటలోపల జేబు నింపుకోడానికి—ఇది కలకత్తా కాదు, ఇది పాలకొల్లు!

'అయితే...?' అన్నాను అర్థంకాక,

"అయితే యిక్కడ రోగులు వైద్యం చేయించుకొంటారు. పల్లెటూళ్లు, అగపడితే సలాంగిలాం కొడతారే గాని బిల్లుమాట ఏమీ ఎత్తరు! —"

పాలకొల్లులో ప్రాక్టీసు పెట్టాలనుకున్న నాకు ఆశ్చర్యం.. ఇంకా భయం వేసింది!

"అందుచేత సంవత్సరానికొకసారి, ఏ పెళ్లీ పబ్బమో చేయించాలి.. అలా చేయించితేగాని, పిల్లల శుభకార్యాలకేబుల్లతో!-మన వృత్తిని పందిరిలో కూర్చుంటేకాని మనకు చదివింపులు పేరుతో వచ్చేటి కానుకలు మన ఖజానాలో నిండవు—" అన్నాడు సునాయాసంగా!

అయిదేళ్లూ నానాఅవస్థపడి డాక్టరుచదివిందానికంటె, రోగులచుట్టూ తిరిగి వాళ్లను పరిశీలించేకంటె పెళ్లిళ్లు, పబ్బాలకు బదులు ఈ వ్రతాలు చేయడం కష్టం, బాధ అనిపించింది.!

'పెళ్లిళ్లు పబ్బాలు చేయక వ్రతాలు చేస్తావేం రా' అని అడిగాను.

"...మనకు బిడ్డా, పిల్లా లేరు కాద టోయ్! అందుకని వ్రతాలు చేయాలి— పిల్లలకోసం కాకపోయినా మన ఫీజు కోసం...!" అంటూండగానే అగ్నేపల్లివారింటిముందర కారు ఆగింది.

అగ్నేపల్లివారింట్లో కాలుపెట్టగానే రోగిని గురించి మాట్లాడేముందు, ఆయనగారు 'మొన్న వ్రతానికో చెక్కు పంపాను ...గ్రహించారనుకుంటాను' అన్నాడు.

నేనూ మారాజూ నవ్వుకున్నాం, ఏదో అర్థంచేసుకున్నట్లు—నేను.


## శ్రీ మద్భగవద్గీత

వ్యాఖ్యాత: శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావు

పంచమ ముద్రణము: వెల రూ 4-0-0

(ప్యాకింగు, పోస్టేజి రూ 0-9-0)

సంస్కృతమూలము. శ్రీ కాశీనాథుని నాగేశ్వరరావుగారు వ్రాసిన తెలుగు టీకా తాత్పర్య విశేషార్థ వివరణలుగల 400 పుటల గ్రంథము. గీతాధ్యయనము చేయువారు మిక్కిలి ఉపయుక్తమైనది. ఖద్దరు బైండు.

ఆంధ్ర గ్రంథమాల,

తపాలాపెట్టె 212, మద్రాసు.